క్లుప్తంగా

క్యాంపస్ ఉద్యోగాలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపక బృందం

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. కోడే న్కషా ఎడ్యుకేటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఈ జాబ్ మేళాలో ఈ కళాశాలకు చెందిన 10 మంది బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక య్యారు. ఎంపికైన విద్యార్థులకు ఆ కంపెనీ మూడు నెలల పాటు వేతనంతో కూడిన శిక్షణ ఇస్తుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీని వాసరావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.8 లక్షల వరకూ వేతనం వుం టుందని తెలిపారు. జాబ్‌మేళాలో ఆ కంపెనీ ఉద్యోగులు, కాలేజీ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

కపిలేశ్వరపురం: డ్రై డే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని 19 గ్రామాల్లో శుక్ర వారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి, కపి లేశ్వరపురం, టేకి, వడ్లమూరు, నేలటూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు వీధుల్లోని వ్యర్థాలను తొలగించారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు గ్రామ వీధుల్లో ప్రయో గాత్మకంగా ఆరోగ్య పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఖాళీ పాత్రల్లో నీళ్లను తొలగించాలని వివరించారు. కార్యక్ర మంలో గ్రామాల్లోని పంచాయతీ, వైద్య, ఆరోగ్య, శాఖ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి



పడమర ఖండ్రికలో అవగాహన కల్పిస్తున్న జిత్తుక మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం: ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని అంగర పీహె చ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు అన్నారు. శుక్రవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా మండలంలోని అంగర పీహె చ్‌సీ పరిధిలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామా రావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి మాట్లా డుతూ బీపీని ఎప్పటికపుడు పరీక్షించుకుం టూ జాగ్రత్త పాటించాలన్నారు. కార్యక్రమం లో ఆయా గ్రామాల వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోతులు పూడ్చండి

రామచంద్రపురం: పట్టణ పరిధిలోని 23వ వార్డులో గుండప్ప వారి సందు ఎదురుగా మునిసిపాలిటీ వాటర్ విభాగం తాగునీటి పైపులైన్ మరమ్మతు నిమిత్తం తవ్విన గోతులు ప్రమాదకరంగా మారాయని వెం టనే పూడ్చాలని స్వచ్ఛభారత్ కోనసీమ జిల్లా బీజేపీ కన్వీనర్ సలాది సతీష్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. వాటర్ పైప్‌లైన్ మరమ్మతుల కసం గోతులు తవ్వి దాదాపుగా పది రోజులు అయిందని, పైపులైన్ మరమ్మతు పూర్తి చేయకపోగా తాగునీరు లీక్ అవుతూనే ఉం దని తెలిపారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ గొయ్యి వాహనదారులకు ఇబ్బంది కరంగా మారిందని పేర్కొన్నారు. మున్సిపా లిటీ అధికారులు వెంటనే ఈ సమస్యను పరి ష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



శలపాక జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యా ధికారి ఎస్.సౌజన్య అన్నారు. శుక్రవారం మం డలంలోని శలపాకలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు పాల్గొని 327 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య మాట్లాడుతూ గ్రామాల్లో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స నందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించేం దుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

కరాటేతో ప్రాణ రక్షణ

- ఖడ్గ విన్యాసంలో రాణిస్తున్న దుర్గారావు, సురేష్
- విద్యార్థులకూ నేర్పుతున్న వైనం
- వేసవిలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహణ
- కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన యువకులు



విద్యార్థినికి శిక్షణ ఇస్తున్న దుర్గారావు

కపిలేశ్వరపురం: మారిన సామాజిక పరిస్థితుల నేపథ్యంలో నేర ఘటనలు పెరిగాయి. మనసులో కలిగిన ప్రతికూల భావనలను అతిగా ఊహిం చుకుని ఎదుటి వారిపై అసహనం రూపంలోనో, ఆగ్రహం రూపంలోనో వ్యక్తం చేస్తున్నారు. తరచూ జరిగే ఇలాంటి ఘటనలు ఒక్కోసారి తీవ్ర రూపం దాల్చి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మను షులు మధ్య మంచి చెడులు ఎలా ఉన్నా ప్రాణా లను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం కరాటే లాంటి ఆత్మ రక్షణ విద్యను అభ్యసించడం ప్రయోజనకరం. కరాటే విద్యను నేర్చుకుని మెరుగైన ఫలితాలను, గుర్తింపును సాధించిన వారిలో కపిలేశ్వరపురం మండలంలోని మత్సా దుర్గారావు, పితాని సురేష్ ఉన్నారు. ఇతరు లకు ఉచితంగా నేర్పుతూ ముందుకు సాగుతు న్నారు.

కరాటే జీవితం ప్రారంభం ఇలా...

వారిద్దరూ ఆలమూరు మండలం కలవచర్లలోని గోల్డెన్ డ్రాగన్ చైనీస్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ శిక్ష ణా సంస్థ నిర్వాహకులు టి.అబ్బులు వద్ద కుంగ్ ఫూ, కరాటే క్రీడల్లో శిక్షణ పొందారు.

కరాటే కుంగ్ ఫూ లోని మూడు ప్రధాన విభాగా లైన కిక్స్ (కాళ్లతో తన్నుతూ పోరాడటం), కటాస్ (జంతువుల భంగిమలో పోరాడటం), వెపన్స్ (ఆయుధాలతో విన్యాసం)లలో వారు మంచి ప్రావీణ్యం సాధించారు. నేడు వారిద్దరూ విడివిడిగా వివిధ వేదికలు ద్వారా అనేక మందికి శిక్షణ ఇస్తూ సుర కత్తెలాంటి క్రీడాకారులను తయారు చేస్తున్నారు.

దుమ్ము రేపుతున్న దుర్గారావు



కుంగ్‌ఫూ ప్రదర్శనలో మత్సా దుర్గారావు

అంగరకు చెందిన మత్సా దుర్గారావు చిన్నప్పుడు తాను చూసిన సినిమాలో హీరో చేసిన కరాటే విన్యాసాలకు ఆకర్షితుడయ్యాడు. ఎప్పటికైనా కరాటే మాస్టర్ కావాలనుకున్న దుర్గారావు నిత్య సాధనతో అనేక పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ప్రస్తుత వేసవిలో అంగర జెడ్పీ ఉన్నత పాఠశా లలో విద్యార్థులకు ఉచిత ఆత్మ రక్షణ తరగతు లను బోధిస్తున్నాడు. కలవచర్లలో తన గురువు అబ్బులు వద్ద సాధన చేసి 2018లో బ్లాక్ బెల్ట్ సాధించాడు. 2023 అక్టోబర్‌లో విశాఖలో థైక్వాం డో ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్ 14 విభాగం పోటీల్లో అంగరకు చెందిన ముగ్గురు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. 2019 మార్చిలో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి థైక్వాండో పోటీల్లో రెండో స్థానాన్ని, 2016 మేలో తాళ్ళ రేవులో డిఫెన్స్ ఈగల్ ఇన్‌స్టిట్యూట్ వారి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రథమ స్థానాన్ని, 2017లో ద్వారపూడిలో లయన్స్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ వారి రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాన్ని, 2019లో విజయవాడలో నిస్కిన్ థాయ్ ఛీ కుంగ్ ఫూ అకాడమీ రాష్ట్ర స్థాయీ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించాడు.

చురకత్తి సురేష్



కత్తుల విన్యాసంలో పితాని సురేష్

కపిలేశ్వరపురానికి చెందిన పితాని సురేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని మియాపూర్ హెచ్‌ఎంటీ కాలనీలో ఎస్‌కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం వరకూ సురేష్ మండపేట, రామ చంద్రపురం నియోజకవర్గ పరిధిలోని పలు వేదికలపై ప్రతిభ కనబరిచాడు. 8వ తరగతి చదువుతుండగా 2007లో చేరాడు. తెల్లవారు జామున 4 గంటలకు నిద్ర లేచి గోదావరి గట్టు మీదుగా సైకిల్‌పై 12 కిలోమీటర్లు ప్రయానం చేసి తర్ఫీదు పొంది పాఠశాల తెరిచే సమయా నికి కపిలేశ్వరపురం వచ్చేసేవాడు. 2008లో బ్లాక్ బెల్ట్ సాధించిన సురేష్ 2009 జూలైలో విజ యనగరంలో కుంగ్ ఫూ కరాటే జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధిం చాడు. 2012 విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పత కాన్ని, 2013లో కోనసీమలోని పేరూరులో రాష్ట్ర స్థాయీ పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. 2014 నుంచి ఇనిస్టిట్యూట్ స్థాపించి శిష్యులను రాష్ట్ర స్థాయీ పోటీలకు తర్ఫీదు ఇస్తూ విజయా లను సాధించారు.

స్టాక్ పాయింట్ తనిఖీ చేసిన డీవైఈవో



మండల స్టాక్ పాయింట్‌కు చేరుకున్న నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీవైఈవో నరసింహ ఫణి

రాయవరం: విద్యాకానుక–5లో భాగంగా వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వివిధ రకాల వస్తువులను సరఫరా చేయనున్నారు. అందుకు రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశా లలో మండల స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ పాయింట్‌ను రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద నరసింహ ఫణి శుక్రవారం తనిఖీ చేశారు. మండల విద్యా శాఖాధికారి–2తో కలిసి ఆయన ఈ స్టాక్ పాయిం ట్‌ను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లు పరిశీలిం చారు. మండల స్టాక్ పాయింట్‌కు ఇప్పటి వరకూ నోట్‌బుక్స్ మాత్రమే చేరుకున్నాయని ఎంఈవో–2 సూర్యనారాయణ డీవైఈవో ఫణి తెలిపారు. మండల స్టాక్ పాయింట్‌కు వచ్చే వస్తువులను పాఠశాలలకు సరఫరా చేసే లోపు నాణ్యత దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం మండల స్టాక్ పాయింట్‌లో నిర్వహించాల్సిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠ శాల హెచ్‌ఎం వీఎస్ సునీత, ఎంఐఎస్ కో–ఆర్డి నేటర్ ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వద్దన్నా వినరే..



రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో పంట పొలంలో నిప్పు పెట్టిన రైతులు

రామచంద్రపురం రూరల్: వరి కోతలు పూర్తయిన తరువాత పంట పొలాల్లో మిగిలిన వరి పంట మొక్కల మొదళ్లకు రైతులు గత కొన్ని సంవత్సరా లుగా నిప్పు పెడుతున్నారు. తరువాత పంటలకు పొలాలను సిద్ధం చేసుకునే క్రమంలో నాగలికి అడ్డు తగలకుండానో..మరే కారణం చేతనో రైతుల ఇలా నిప్పు పెట్టడం చేస్తున్నారు. అయితే వ్యవసాయ అధి కారులు ఇలా నిప్పు పెట్టకండా వాటితో పాటే నేలలో కలియదున్నడం వల్ల భూమి సారవంతమవు తుందని, అంతే కాకుండా ఇలా నిప్పు పెట్టడం వల్ల పంటలు పండడానికి రైతులకు సహకరించే మిత్ర పురుగులు నశించిపోయి నష్టం వాటిల్లుతుందంటు న్నారు. ఇలా రైతులు అనాలోచితంగా నిప్పు పెట్టడం వల్ల పంట పొలాల్లో ధాన్యం నిల్వ చేసుకున్న రైతుల ధాన్యం మంటల పాలు కావడం, గాలల ప్రభావం తో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదాలకు కారణం కావడం, వాతావరణం కలుషితం కావడం జరుగు తుందని అగ్ని మాపక అధికారులు అంటున్నారు. పంట పొలాల నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లకు నష్టం వాటిల్లుతుందని విద్యుత్ శాఖ అధికారులు వాపోతున్నారు. ఇలా అన్ని విధాలుగా నష్టాలనే కలి గించే నిప్పు పెట్టే విధానాన్ని మానుకోవాలని అన్ని శాఖల అధికారులు తెలుపుతున్నా కొందరు రైతులు పెడచెవిన పెడుతున్నారంటున్నారు. రైతులూ ఇక నైనా కోతలు పూర్తయిన పంట పొలాల్లో నిప్పు పెట్ట వద్దని పలువురు కోరుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలింపు



రాజోలు స్టాక్ పాయింట్ నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలించుకుపోతున్న దృశ్యం

రాజోలు: జగనన్న కాలనీలలో నిర్మాణాల కోసం రాజోలు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో స్టాక్ పాయింట్‌లో ఉంచిన ఇసుకను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకుపోతున్నారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుకను గృహనిర్మాణ లబ్ధిదారులకు మాత్రమే కూపన్లు ఇచ్చి గృహనిర్మాణ శాఖ అధికారులు పం పిణీ చేస్తారు. అయితే గత కొంతకాలంగా స్టాక్ పాయింట్‌లో ఉంచిన ఇసుకను కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా జేసీబీని ఉపయోగించి ట్రాక్టర్లల్లో ఇసుకను లోడ్ చేసి, ఇసుకను తరలించుకుపోతు న్నారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక సగం మేర ఖాళీ అయిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్ని కల పురస్కరించుకుని ఎన్నికల కోడ్ నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇసుక టోకెన్లు ఇవ్వలేదని గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. గతంలో రెండు, మూడు పర్యాయాలు ఇసుక తరలించు కుపోయినట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని, అయితే ఇసుక తరలింపుపై నిఘా ఉంచామన్నారు. ఇసుక తరలించుకుపోతున్న ట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని హౌసింగ్ ఏఈ సత్యనారాయణ తెలిపారు.

సంతోషానికి ఎంపీ పరామర్శ



ఇంత సంతోషాన్ని పరామర్శిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూ రుకు చెందిన సీనియర్ దళిత నాయకుడు, జెడ్పీ టీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషాన్ని రాజ్య సభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం పరామర్శించారు. ఇంత సంతోషం ఈ ఎన్నికల్లో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు ఎలక్షన్ జనరల్ ఏజెంట్‌గా ఉన్నారు. ఎన్నికల కార్యకలాపాల్లో భాగంగా ఈ నెల 12 న రామచంద్రపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద అదుపు తప్పి పడిపోయారు. అయితే తరువాతి రోజు పోలింగ్ ఉండటంతో తనకు అసౌకర్యంగా ఉన్నా సరే ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీ ఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు వెన్నంటి ఉన్నారు. ఆ తరువాత కాకినాడలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. భుజం ఎముక చిట్లి పక్కకు తప్పుకోవడంతో శస్త్ర చికిత్స చేసి ప్లేటు వేశారు. దీంతో ఎంపీ బోస్ శుక్రవారం కాకి నాడ లక్ష్మి ఆసుపత్రిలో ఇంత సంతోషాన్ని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. ఎంపీ బోస్ వెంట నాయకులు శీలం గంగరాజు, ప్రగతి వెంకన్న, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, కాజులూరు రంగా, వైట్ల సత్యనారాయణ, కందులపాలెం అబ్బు తది తరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకం

కొత్తపేట: స్థానిక సీనియర్ అండ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో పార లీగల్ వలంటీర్ల నియా మకం జరుపుతున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి, మం డల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ పి.రమణా రెడ్డి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ గంధం సునీత ఆదేశాల ప్రకారం పారా లీగల్ వలంటీర్ల నియామకం చేపట్టినట్టు పేర్కొన్నారు. పారా లీగల్ వలంటీర్లుగా పనిచే యుటకు స్థానిక కోర్టు పరిధిలో అభ్యర్థులు తమ బయోడేటాను వచ్చే నెల 10 వ తేదీ లోపు కోర్టులో అందజేయాలని కోరారు.

ఆహారపు అలవాట్లతో బీపీ నియంత్రణ

మామిడికుదురు: ఆహార అలవాట్ల ద్వారా బీపీని నియంత్రించవచ్చని నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వర్ణలత, రమ్యశైలజ సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం (బీపీ డే)లో భాగంగా శుక్రవారం రెండు పీహెచ్‌సీల్లో ర్యాలీలు నిర్వహించా రు. నేను తరచూ బీపీ చెక్ చేయించుకుంటానంటూ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో రెండు పీహెచ్‌సీల ఉద్యోగులు, ఆశాలు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చ

- హోటళ్లు, కిల్లీ కొట్లు, కిరణా షాపుల వద్ద సందడి
- ఏ నలుగురు కలిసినా ఫలితాలపై సమీక్ష



కొత్తపేట: ఓ గ్రామంలో రచ్చబండ చర్చ ఇలా సాగింది.

వెంకన్న: ఒరే రామన్నా.. ఈసారి ఎవరు గెలుత్తారం టావ్...

రామన్న: ఒరే వెంకన్నా.. నాకైతేరా.. మళ్లీ మనె మ్మెల్యే నెగ్గుతాడనిపిస్తుందిరా.. వెంకన్న– అంతే నంటావా.. మరీ.. ఆ వర్గపోళ్లందరూ అవతలి అబ్బేర్థికి కొట్టేశారంటున్నారు.. అయినా మళ్లీ ఈయనే నెగ్గుతాడంటావా..

సోమన్న: ఒరే వెంకన్నా.. ఈ ప్రభుత్వం ఎన్నో పథ కాలు పెట్టింది. ఎవరి దగ్గరికీ ఎల్లక్కల్లేకుండా వలం టీరు దోరా డైరెట్టుగా వచ్చాయి కదా.. మనతో పాటు చాలా మంది అందుకున్నారు కదా.. మరి ఓట్లెయ్యరేంటి.. అప్పుడు ఎమ్మెల్లే అబ్బేర్థే నెగ్గ తాడు కదా.. ఇంకా డౌటేంటిరా..

వెంకన్న: నువ్వు చెప్పినట్టు మళ్లీ జగనే సీఎం అవుతాడన్నమాట..

సోమన్న: ఈడేంటిరా.. రాజీకీయం అంతా ఇని రాజశేఖరరెడ్డికి జగన్ ఏమవుతాడన్నట్టుంది. నీ డౌటు.. కచ్చితంగా మళ్లీ జగనే సీఎం.

జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై ఎక్కడికక్కడ జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఎన్నికల్లో ప్రధానమైన పోలింగ్ ఘట్టం ముగిసి నాలుగురో జులైంది. ఇక ఓట్ల లెక్కింపు మిగిలింది. దానికి ఇం కా 18 రోజులు సమయం ఉండగా గెలుపోట ములు, మెజార్టీలపై ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో కూడళ్లు, రచ్చబండలు, హోటళ్లు, కిల్లీ కొట్లు, సెలూన్లతో పాటు బస్టాపులు, బస్సులు, ఆటోల్లో ఎక్కడ ఏ నలుగురు కలిసినా జరిగిన ఎన్ని కలు గురించి, ఎన్నికల ఫలితాల గురించే చర్చ. నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది? రాష్ట్రంలో ఏ పార్టీ గెలుస్తుంది? ఎన్ని సీట్లు వస్తాయి? అనే దానిపై జోరుగా చర్చోప చర్చలు సాగుతున్నాయి. కొన్ని చోట్ల ఆయా పార్టీల సానుభూతిపరుల మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఫలానా పార్టీ అభ్యర్థికే ఎక్కు వగా గెలుపు అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ సానుభూతిపరుడు అంటే.. కాదు ఈ పార్టీ అభ్యర్థే గెలుస్తున్నాడు.. అంటూ మరో వ్యక్తి వాదిస్తున్నాడు. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగిం ది. ఓటర్లు పోలింగ్ ప్రారంభానికి ముందుగానే పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని క్యూలో బారులుతీరి నిలబడి ఓర్పుతో ఓటెయ్యడం, వారిలో వృద్ధులు, మహిళలు ఉండటంతో ఫలితం ఏ పార్టీకి అను కూలంగా ఉంటుందనే దానిపై అంచనాలు వేస్తు న్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా రాజకీయాలపై ఆసక్తి ఉన్న అనేకమంది ప్రస్తుత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథ కాలు, జరిగిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, నగదు, ఇతర పంపిణీలు తదితర అం శాలను కూడా పరిగణలోకి తీసుకుని అంచనాలు వేస్తున్నారు. నియోజకవర్గంలోనే కాక ఇతర నియోజకవర్గాలలో పరిస్థితిపై కూడా ఆరా తీస్తు న్నారు. మీ నియోజకవర్గంలో ఏమిటి పరిస్థితి? ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది? అని వారి వారి బంధువులు, స్నేహితులు, తెలిసిన పరి చయస్తులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుంటున్నారు. నియోజకవర్గంలో, రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాల వారీగా కూడా అంచనాలు వేసుకుంటూ ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. జిల్లాలో, రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయన్న దానిపై చర్చించు కుంటున్నారు. ఇప్పటికే ఏ పార్టీకి ఆ పార్టీ జిల్లాల వారీగా గెలిచే సీట్లు జాబితా బయటకు రాగా పరిశీ లకులు తమ పరిశీలనతో ఆయా పార్టీలు కచ్చితం గా గెలిచే సీట్లను టిక్ పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీకి 'సంక్షేమ' ధీమా..

గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రభావం ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో ఎక్కు వగా కనిపించిందని పరిశీలకులు చెబుతు న్నారు. దానితో అత్యధికంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం సాధించడం ద్వారా ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని వాదన ఎక్కువగా వినిపిస్తుంది. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేద లకు మేలు చేకూర్చే విధంగా సీఎం జగన్ పరిపాలన కొనసాగించిన విషయం తెలిసిందే. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిందిలేదు. ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే వారికి మేలు చేకూర్చింది. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరుపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారు. తాజాగా జరిగిన పోలింగ్‌లోనూ ఇదే అంశం ప్రస్ఫుటమైనట్టు పరిశీలకులు భావిస్తు న్నారు.

గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహి ళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఆ ఓటు బ్యాంకు అంతా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆ పార్టీ అభ్య ర్థుల గెలుపు నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లే షకులు అంచనాకు వచ్చారు. కొన్నిచోట్ల పం దాలు కూడా జరుగుతున్నట్టు సమాచారం. జిల్లాలోనే ఏ నియోజకవర్గంలోనూ లేని విధం గా ఈ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించామ ని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, దానితో గత మెజార్టీకి మించి ఓట్ల అధిక్యతతో హ్యాట్రిక్ సాధిస్తామని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఈత సరదాలపై అప్రమత్తంగా ఉండాలి



సీఐ దొరరాజు

కె.గంగవరం: వేసవి కాలం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉల్లాసం కోసం పంట కాలువలు, చెరు వులు, గోదావరిలో ఈతకు దిగడం ప్రమాద కరమని రామచంద్ర పురం సీఐ పి.దొరరాజు హెచ్చరించారు. మండల కేంద్రమైన కె.గంగవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవుల కారణంగా పట్ట ణాల్లో ఉండే యువత సొంత ఊర్లకు రావడం లేదా, బంధువుల ఇంటికి వెళ్లడం సర్వసాధారణమ న్నారు. ఇలా పల్లెలకు వచ్చిన యువత సరదా కోసం తెలియని చోట పంట కాలువలు, చెరువులు, గోదావరిలో ఈతకు దిగుతున్నారన్నారు. ఇటీవల కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లో సరదా కోసం ఈతకు దిగి ఇద్దరు యువకులు మృతి చెం దారన్నారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజ లతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈతకు నీటిలో దిగకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు వేసవి కార ణంగా ఇంటి బయట నిద్రించే వారు కూడా అప్ర మత్తంగా ఉండాలని దొంగలు దోచుకునే అవకాశం ఉందన్నారు.

నేడు వెంకన్న కల్యాణం



కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటి వారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించను న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 19న స్వామి వారి తీర్థం నిర్వహించనున్నామన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తర లివచ్చి వెంకన్న ఆశీర్వాదాలు స్వీకరించాలన్నారు.

నేడు అమ్మవార్ల జాతర



బొక్కావారిపాలెంలో కొలువుదీరిన అమ్మవార్లు

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెం లో కొలువుదీరిన మహాలక్ష్మమ్మ, వనువులమ్మ వార్ల జాతర శనివారం రాత్రి జరుగుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. అమ్మవారికి ఆదివారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, అదే రోజు మధ్యాహ్నం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది. జాతర మహోత్సవాల సందర్భం గా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాల వెలుగు లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.

నేటి నుంచి వాసవీ మాత ఆవిర్భావ వేడుకలు

అంబాజీపేట: స్థానిక బస్‌స్టేషన్ వద్ద వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గోకవరపు శివ, కోశాధికారి బొండాడ శివ తెలిపారు. 18న సుప్రభాత సేవ, 19న ఉమాచం ద్రమౌళి అర్ధనారీశ్వర స్వామి వారి కల్యాణం, 23న పుష్పోత్సవం నిర్వహించనున్నామన్నారు.

గ్రామీణ పేదల ఆరోగ్య రక్షణకు జాస్



ఆలమూరులో నిర్వహించిన జాస్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేద ప్రజల ఆరోగ్య రక్షణకు, మెరుగైన చికిత్స కోసం ఈ ఏడాది జనవరి నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్)ను ప్రవేశ పెట్టిందని ప్రత్యేక వైద్య నిపు ణులు జి.దుర్గా ప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో శుక్రవారం జాస్ ఫేజ్–2 కార్యక్రమం జరిగింది. పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారులు పి.భవానీ శంకర్, డి.సాయి కిషోర్ నేతృత్వం లో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 267 మందికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందు లను అంద జేశారు. అవసరమైన రోగులకు రక్త పరీ క్షలు నిర్వహించారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులకు వైద్య సల హాలు సూచనలు తెలియజేశారు. వ్యాధి తీవ్రత అధి కంగా ఉన్న వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వేణి, సీహెచ్‌ఓ పి.రా ధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూప ర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఎంఎల్‌హెచ్ పీలు కె.సుమాంజలి, శ్వేత, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఆరోగ్య ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సుమారుగా 5 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నట్లు ఏపీఓ నాగ బాబు తెలిపారు. కొబ్బరి చెట్ల వద్ద పళ్లాలు వేయడం , పంటకాలువలు, పంటబోదెల్లో పూడికతీత పనులు, తుప్పలు తొలగింపు వంటి పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ పనులను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకు న్నట్లు ఆయన తెలిపారు.